రేషన్ సరకులు డిపోల వద్దే పంపిణీ చేయాలి

మునగపాక: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ సరకులు డిపోల వద్దనే పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. ఈ మేరకు విధి విధానాలను గురువారం రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డిపో డీలర్లకు వివరించారు. ప్రతి డిపో వద్ద డీలర్ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సరకులను బట్వాడా చేయాలన్నారు. ముందుగా వినియోగదారులకు డిపో వద్దకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. డీటీ శేషుబాబు, పలువురు డీలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి రథయాత్ర



సాగుతున్న శ్రీసత్య సాయి భజన మండలి రథయాత్ర

పాయకరావుపేట: పుట్టపర్తిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో బయలుదేరిన శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర గురువారం పాయకరావుపేటకు చేరుకుంది. మూడు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా యాత్ర చేస్తూ పట్టణంలో శ్రీసత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో వై.జంక్షన్ దగ్గర నుంచి బస్టాండ్ వరకు స్వామి వారి వేదం భజన, కోలాటంతో రథయాత్ర సాగింది. అనకాపల్లి, రుక్మిణీపురం, నక్కపల్లి, వేంపాడు, తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయి నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి జిల్లా ప్రెసిడెంట్ కసిరెడ్డి అప్పలనాయుడు, కన్వీనర్ పి.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న రమా

మునగపాక: ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌పై అవగాహన పెంచుకుని, సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీఎస్ మహిళా కానిస్టేబుల్ రమా కోరారు. మునగపాకలో గురువారం మహిళలకు శక్తియాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే 112 నంబరుకు కాల్ చేయాలన్నారు. పురుషుల నుంచి ఎటువంటి సమస్య ఎదురైనా భయం లేకుండా శక్తియాప్‌ను వినియోగించాలన్నారు. పలువురు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీకాలతోనే పిల్లలకు ఆరోగ్యం



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఎస్.రాయవరం: పిల్లలకు వ్యాధి నిరోధిక టీకాలు ఆరోగ్యవంతంగా ఉండేందు ఉపయోగపడతాయని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చద్రశేఖర్ తెలిపారు. పెనుగొల్లు పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో టీకాలు, ఇతర మందులు నిల్వ చేసే గదులను పరిశీలించారు. గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పుట్టిన బిడ్డకు విధిగా తల్లి పాలు పట్టేలా అవగాహన కల్పించాలని చెప్పారు. పీహెచ్‌సీ సిబ్బంది ఆస్పత్రికే పరిమితం కాకుండా కేటాయించి పనులు పక్కాగా నిర్వర్తించాలన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా స్టాటస్టిక్ అధికారి రామచంద్ర మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమ్మతల్లి జాతర



కొత్తమ్మతల్లిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: వెంకటాపురం గ్రామంలో కొత్తమ్మతల్లి జాతర గురువారం ఘనంగా జరిగింది. రైతులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అమ్మవారికి సారె, చీర సమర్పించి, పసుపు కుంకుమములతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మండలంలో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎ.చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. 16 నుంచి 35 సంవత్సరాలు మధ్య వయసు వారికి రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వ్యవసాయానికి 'ఉపాధి' తోడు

- రైతులకు మేలు చేస్తున్న ఉపాధి హామీ పథకం
- వేధిస్తున్న కూలీల సమస్యకు పరిష్కారం



ఉపాధి హామీ పథకం కింద కొబ్బరి తోటలో పాది తవ్విన దృశ్యం



కొరుప్రోలు కొబ్బరి తోటలో రింగ్ ట్రెంచ్‌లు తవ్వుతున్న కూలీలు

ఎస్.రాయవరం: వ్యవసాయ అనుబంధ పనులకు ఉపాధి హామీ పథకం నిధులను కేంద్ర ప్రభుత్వం అనుసంధానం చేయడం రైతులకు మేలు చేస్తోంది. ఉపాధి నిధులతో చేపడుతున్న చెరువులు, సాగునీటి కాలువలు, మొక్కల పెంపకం వంటి పనులతో పాటు కొత్తగా వ్యవసాయంతో రైతులకు ఉపయోగపడే పనులను మంజూరు చేస్తున్నారు. రైతుకు అవసరమైన పంట కాలువల నిర్మాణంతో పాటు పొలం గట్లపై మొక్కల పెంపకం, పొలంలో గుంతల తవ్వకం, సరిహద్దు కందకాలు నిర్మించుకోవడం, వ్యవసాయ బావుల నిర్మాణం, పండ్ల తోటల్లో రింగ్ ట్రెంచీల నిర్మాణం, గడ్డి పెంపకం, పండ్లు, పూలు, పట్టు పురుగులు, మల్బరీ తోటల పెంపకానికి నిధులు మంజూరు చేయనున్నారు.

ఎస్.రాయవరం మండలంలో ప్రతి ఏటా ఉపాధి హామీ పథకంలో 65 శాతం పనులు ఉద్యానవన శాఖ పంటలకు అనుసంధానంగా చేపడుతున్నారు. కొబ్బరి, జీడి, మామిడి తోటల్లో పాదులు తవ్వడం, పెద్ద తోటలకు చెట్టుకు చెట్టుకు మధ్య నీటి నిల్వ బంటాలు తవ్వుతున్నారు. ఇప్పటి వరకు మండలంలో 1500 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు మేలు చేకూరేలా పనులు నిర్వహించారు. ఇకపై అవసరమున్న రైతులకు కూడా పనులు కేటాయించి పంటల అభివృద్ధికి సహకరిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మండలంలో 150 ఎకరాల్లో ఉద్యానవన అనుసంధానం పనులు చేపడుతున్నారు. ఎకరాకు మూడేళ్ల పాటు పంటల సాగుకు రూ.1.25 లక్షలు వెచ్చించి పండ్ల తోటలు పెంపకానికి సహకరిస్తున్నారు. పంట కాలువల్లో ప్రతి ఏడాది పూడిక తీత చేసి ఖరీఫ్ రైతులకు కూడా సహకారం అందిస్తున్నారు. ఖరీఫ్ పంటలకు కూడా ఉపాధి హామీ పనులు అనుసంధానం చేస్తే రైతులకు కూలీల సమస్య తీరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఉపాధి' సహకారం బాగుంది



ఉపాధి హామీ పథకం కొబ్బరి తోటలకు రింగ్ ట్రెంచ్‌లు తవ్వారు. దీంతో నీటి నిల్వ పెరుగుతోంది. ఇదే పనులకు కూలీల కోసం ఎదురు చూసినా దొరకడం లేదు. పైగా ఉచితంగా ఈ పనులు చేయడం చాలా ప్రయోజనంగా ఉంది. ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్రం అందిస్తున్న సహకారం బాగుంది.

–ప్రతిపాటి బాలశివరామకృష్ణ, రైతు, కొరుప్రోలు, ఎస్.రాయవరం మండలం

దరఖాస్తు చేసుకున్న వారంలో పనులు



ఉపాధి పనుల్లో ఉద్యాన పంటల రైతులకు 65 శాతం ప్రాధాన్యత పనులు కేటాయిస్తున్నాం. సద్వినియోగం చేసుకునే రైతులకు మంచి ఫలితాలు వస్తున్నాయి. అవసరమున్న రైతులు దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో పనులు మొదలు పెడుతున్నాం. అలాగే పండ్ల తోటల పెంపకానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం.

–ఎరకయ్య, ఏపీవో, ఎన్ఆర్‌జీఎస్, ఎస్.రాయవరం మండలం

యోగా భారతీయ వారసత్వ సంపద



ఉపమాకలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ శాఖల సిబ్బంది



కొరుప్రోలులో యోగాంధ్ర చిత్ర లేఖన పోటీల్లో సూచనలు ఇస్తున్న వైద్యురాలు సుజాత



మునగపాకలో యోగా సాధన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



కోటవురట్లలో ఏర్పాటు చేసిన డ్రై ఫ్రూట్స్

నక్కపల్లి: యోగా అనేది భారతీయ వారసత్వ సంపద అని ఉపమాక దేవస్థాన ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు అన్నారు. యోగాంధ్ర–2025 పురస్కరించుకుని గురువారం ఉపమాక ఆలయ ప్రాంగణంలో ప్రోటోకాల్ యోగా కార్యక్రమం జరిగింది. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, ఏఎన్ఎంలు, ఐకేపీ సిబ్బందికి యోగాసనాలు నేర్పించారు. ఎంపీడీవో సీతారామరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసాదాచార్యులు మాట్లాడుతూ యోగా, ప్రాణాయామం, ధ్యానంతో సత్వగుణం అలవడుతుందన్నారు. మండలంలో ఉపమాక, దేవవరం, జానకయ్యపేట, నక్కపల్లి, చినదొడ్డిగల్లు గ్రామాల్లో యోగా తరగతులు నిర్వహించారు.

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరు యోగాంధ్రలో భాగస్వామ్యం కావాలని కొరుప్రోలు ఆయుష్ వైద్యురాలు సుజాత కోరారు. కొరుప్రోలు గ్రామంలో విద్యార్థులకు యోగాపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రామ స్థాయిలో పోటీల్లో ఎంపికైన విద్యార్థులను మండల స్థాయి, ఆపై జిల్లా, రాష్ట్ర స్థాయిలకు ఎంపిక చేసి ప్రత్యేక గుర్తింపు ఇస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, మండల యోగా శిక్షకులు ఎస్.శంకర్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక: మండల కేంద్రమైన మునగపాక బైపాస్ రోడ్డులోని రాహుల్‌గాంధీ కల్యాణ మండపంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవోఆర్డీ సోమరాజు, డీటీ శేషుబాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న వారికి పౌష్టికాహారంగా డ్రై ఫ్రూట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఈవోపీఆర్డీ రఘురాం, సచివాలయం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతతోనే రైతుల అభ్యున్నతి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్

పాయకరావుపేట: నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించి రైతులు మరింతగా అభ్యున్నతి చెందాలని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(రాజమండ్రి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఆర్.కొత్తూరు, ఆర్.నర్సాపురం గ్రామాల్లో గురువారం విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, వాటి ఉపయోగం గురించి వివరించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా మాట్లాడుతూ వరిలో నూతన రకాలు, కొబ్బరి, మామిడి, జీడి, తమలపాకు తోటల్లో మేలైన యామామాన్యం పద్ధతులు, చీడపీడల నియంత్రణపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాధాన్యత గురించి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కె.ఉమా ప్రసాద్ వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రెడ్డి సీత, గోపి, ఉపసర్పంచ్ గోవిందరాజు, స్వామి, తాండవ ఎఫ్‌పీవో నుంచి సత్యనారాయణ, జిల్లా వనరుల అధికారి విజేత, సీనియర్ నాయకులు సీతారాం, నాగేశ్వరరావు, కోనే రంగయ్య, జోగి నాయుడు, గాంధీ, జోగిరాజు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎం.శివ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అచ్యుతాపురం రూరల్: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెస్టన్ సెక్టర్ ఇండస్ట్రియల్ ఏరియా, బ్రాండిక్స్ అపెరల్ సిటీ ఏరియా, చిప్పాడ, పూడిమడక, కడపాలెం, జాలరిపాలెం, కొండపాలెం, సీతపాలెం, బీఏఆర్‌సీ, ఐవోసీఎల్, హైటెక్, అభిజిత్ ఐఆర్ఈఎల్, ఏపీఐఐసీ వాటర్ ట్యాంక్, వన్ స్టాప్ బిల్డింగ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

117 మందికి వితంతు పింఛన్ల మంజూరు

కోటవురట్ల: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ కింద పలువురు వితంతువులకు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 117 వితంతు పింఛన్లు మంజూరయ్యాయని, వీరికి జూన్ 12న పింఛను నగదు రూ.4 వేలు అందిస్తారని పేర్కొన్నారు.

అంధకారంలో అచ్యుతాపురం



చీకట్లో సాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు



ప్రమాదకరంగా ఫ్లైఓవర్ నిర్మాణం కోసం తీసిన గోతులు

అచ్యుతాపురం రూరల్ : రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే సెజ్ రహదారి అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. మరోవైపు ఫ్లైఓవర్ నిర్మాణానికి తీసిన భారీ గోతుల కారణంగా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చిమ్మ చీకట్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనలో అచ్యుతాపురం ప్రజలు జీవనం సాగిస్తున్నారు. సెజ్‌కు వెళ్లే రహదారి మధ్యలో ఉండే వీధి లైట్లు తీసేయడంతో పూర్తిగా అంధకారంగా మారింది. దీనికి తోడు రాత్రి 8 గంటల వరకు అనధికార విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చేరువైన కార్పొరేట్ విద్య

- సెజ్ రాకతో అచ్యుతాపురంలో కొలువైన విద్యా కేంద్రాలు
- అద్భుత ఫలితాలతో పోటీ పడుతున్న స్కూళ్లు, కళాశాలలు

అచ్యుతాపురం: సెజ్ రాకతో అచ్యుతాపురం మండల విద్యార్థులకు కార్పొరేట్ విద్య చేరువైంది. ఒకప్పుడు విద్యాభ్యాసం కోసం ప్రభుత్వ విద్యా సంస్థలు, లేకపోతే దూర ప్రాంతమైన విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. ఎక్కువ శాతం వ్యవసాయం, మత్స్య సంపదపై ఆధారపడిన ఈ ప్రాంత ప్రజలకు ఆర్థిక స్తోమత లేక పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ఆసక్తి కనబరిచేవారు కాదు. అటువంటి పరిస్థితుల్లో సెజ్ రాకతో అచ్యుతాపురం దశాదిశా మారిపోయింది. కార్పొరేట్ హంగులతో విద్యాలయాలు వెలిశాయి. పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ఆయా విద్యా సంస్థలు పోటీ పడుతున్నాయి.

పేరులోనే 'అచ్యుత'

అచ్యుతాపురం పేరుకు తగ్గట్టుగానే అచ్యుత పేరుతో స్థాపించిన విద్యా సంస్థ ఎన్నో ఏళ్లుగా ఉత్తమ ఫలితాలతో దూసుకుపోతోంది. నర్సరీ నుంచి డిగ్రీ వరకూ పల్లి శేషగిరిరావు ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ విద్యా సంస్థ స్థానికుల మన్ననలు పొందింది. ప్రతి ఏటా మెరుగైన ప్రవేశాలతో సత్తా చాటుతోంది.

కైట్స్ ప్రతిభ

అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన మరో సంస్థ కైట్స్. కైట్స్ జూనియర్ కాలేజీ, కైట్స్ ఒకేషనల్ కాలేజీ, కైట్స్ డిగ్రీ కాలేజీ, కైట్స్ డిఫెన్స్ అకాడమీలు స్థాపించారు. ఈ ఏడాది ఇంటర్‌లో 984 మార్కులు సాధించిన ఘనత ఈ సంస్థ దక్కించుకుంది.

గ్లోబల్ స్థాయి సంస్థ

ఆవ సోమవరం వద్ద గతంలో నిర్వహించిన టూ వరల్డ్ పబ్లిక్ స్కూల్‌ను ఆధునికీకరించి లిప్స్ కోంబ్ గ్లోబల్ సూల్‌ను ఈ ఏడాది నుంచి ప్రారంభించారు. కేంబ్రిడ్జి మోంటీస్సోరీ ప్రీస్కూల్, లిప్స్‌కోంబ్ గ్లోబల్ స్కూల్‌ను కొత్త హంగులతో ఏర్పాటు చేవారు. గ్లోబల్ స్థాయిలో విద్యార్థుల అవకాశాలకు తగ్గట్టుగా పాఠ్యాంశాలు, సిలబస్, కో కరికులమ్, యాక్టివిటీస్ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఉత్తమ ఫలితాల్లో 'గాయత్రీ'మేటి

అచ్యుతాపురం–పూడిమడక రోడ్‌లో నిర్వహిస్తున్న గాయత్రీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తుంది. పోటీ పరీక్షలకు తగ్గట్టుగా ఈ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అధునాతన విశాలమైన భవనంలో విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నారు. సువిశాలమైన క్రీడా మైదానం ఈ పాఠశాల సొంతం.

పెరిగిన ఉపాధితో ఉన్నత విద్యపై దృష్టి

అచ్యుతాపురం–రాంబిల్లి పరిధిలోని సెజ్‌లో ఉన్న అంతర్జాతీయ, జాతీయ స్థాయి కంపెనీల్లో మెరికల్లాంటి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కళ్లెదుట ఉన్న ఉపాధిని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు సైతం తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నారు. ఈ ఏడాది కొత్త విద్యా సంస్థల ఆగమనం, నర్సింగ్ కాలేజీలు, గ్లోబల్ స్కూల్ రావటం ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. పాలిటెక్నిక్, కస్తూర్బా, ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. నిరంతరం దుస్తుల కర్మాగారంలో రిక్రూట్‌మెంట్, కంపెనీల విస్తరణలో భాగంగా ఉద్యోగ అవకాశాలు, ఎంఎస్ఎంఈలో శిక్షణ, వంటి అంశాలతో అచ్యుతాపురం పారిశ్రామికీకరణతో పాటు విద్యా కేంద్రంగానూ గుర్తింపు పొందుతోంది.

స్వేసెస్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా



స్వయం ప్రతిపత్తి హోదా ఆర్డర్‌ను చూపిస్తున్న విజయ్ ప్రకాష్, తదితరులు

పాయకరావుపేట: శ్రీప్రకాష్ అనుబంధ సంస్థ స్వేసెస్ డిగ్రీ కళాశాల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి స్వయం ప్రతిపత్తి హోదా పొందినట్లు కళాశాల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ హోదా 2025–26 నుంచి 2034–35 విద్యా సంవత్సరం వరకు వర్తించనుందన్నారు. ఈ హోదాతో కళాశాలకు సొంతంగా కోర్సులు రూపొందించుకోవడం, సిలబస్ అభివృద్ధి, పరీక్షల నిర్వహణ, ఫలితాలు ప్రకటించుకునే అవకాశం కలుగుతుందన్నారు. స్వయం ఉపాధి, స్వావలంబన అనే ధ్యేయంతో పని చేస్తున్న తమ విద్యా సంస్థకు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడం వల్ల గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు మరింతగా అందుబాటులోకి వస్తాయని విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, సిబ్బంది సహా ఈ ఘనత సాధనలో భాగమైన ప్రతి ఒక్కరికీ విజయ్‌ప్రకాష్‌తో పాటు శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కె.నరేంద్రబాబు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిహెచ్.వి.కె.నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.